# అద్దం వెనుక

విజయభార్గవి

ఆకాశంలో వున్న తారల నన్నింటినీ కోని మాలగా కూర్చి బంగళా అలంకరించినట్టుగా వున్నది. బంగళా ముందున్న పెద్ద కొబ్బరి తోటలో ప్రతి చెట్టుమీదా తారలు వేళ్ళాడు తున్నాయి. గేటునుంచి తోటలోకి వున్న దారి కిరుప్రక్కలా పూల మొక్కలు రంగు రంగు బల్బులను విరగ బూసినయి. పెళ్ళికి బంగళా యజమాని ట్యూబులైట్లతో ప్రహరీ కట్టించాడు.

నారాయణమూర్తికి కళ్ళు జిగేలు మన్నాయి. "వొచ్చావా పంతులూ! రారా!" మాధవరావుగారు ఆహ్వానించేరు.

నారాయణమూర్తి మందహాసం చేసేడు. చేతులు కట్టుకోబోయి వేళ్ళు నలుపుకున్నాడు. గుండె అదురుతోంది ఓవైపు. కాళ్ళు తడబడ్డాయి. గేటుదాటి లోపలికి వెళ్ళడం పెద్దతప్పుగా అనిపించింది నారాయణ మూర్తికి.

"అలా వెళ్ళి కూర్చోపంతులూ!.... సందేహిస్తున్నావేం?" బలవంత పరిచేడాయన.

నారాయణమూర్తికి అడుగు కదపక తప్పిందికాదు. తోటలో దీపాల వెలుగులో జనం కొత్త బట్టల్లో, ఇస్త్రీ చెరగని బట్టల్లో హడావుడిగా తిరుగుతున్నారు. తోటంతా డబ్బుతో ప్రకాశిస్తోంది.

గేటుదాటి లోపలికి రాంగానే ఆ డబ్బులో కలిసిపోవాలనీ ఆడబ్బులో కూర్చోవాలనీ అనిపించింది. తను వేసుకున్న గళ్ళచొక్కా,పంచా ఆపెళ్ళివెలుగులో కొత్తవిగా కనిపించేయి నారాయణ మూర్తికి. గర్వంగా ఓసారి అందరి మీదకూ చూపులు తిప్పి ముందుకి కదిలేడు. మంటపానికి చుట్టూ తావందల కుర్చీలు వరుసగా ఆక్రమించుకుని కూర్చున్నారు అతిథులు. అక్కడక్కడా ఒకటీ రెండూ కుర్చీలు ఖాళీగా వున్నాయి. ముందు వరుసలో సోఫాలన్నీ ఖాళీగానే వున్నాయి. నారాయణమూర్తికి అక్కడ కూర్చోవా లనిపించింది. అలవాటున్న వాడికిమల్లే వెళ్ళి కూర్చుందామని ప్రయత్నించేడు. అయినా ఆ అలవాటులేని తనం తన నడకలో బాగా కనిపించింది. ఆ సోఫాలో కూర్చోవడం కూడా గొప్పే అనుకున్నాడు. రేపు తను వెళ్ళి స్నేహితులతో చెప్పుకోవచ్చు—తన ఈ అనుభవాన్నీ, అనుభూతినీ.

నారాయణమూర్తి ఒసారి సంతృప్తిగా నిట్టూర్చి వెనక్కి జేరగిలబడి తల ఆన్చేడు. తనేదో పోయిన జన్మలో పుణ్యం చేసుకుని వుండాలనీ. అందుకే



తన కుటుంబంలో ఎవరికీ కలగని అదృష్టం తనకి లభించిందనీ అనుకున్నాడు.

నిజానికి తన్నెన్నిసార్లు ఇలాంటి అనుభవాలని కలల్లో అనుభవించాలని ప్రయత్నించేడు. తన నలభయ్యేళ్ళ జీవితంలోని కలల్లో లభించనిది తానీనాడు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాడూ అంటే....తనదెంత అదృష్టం ??

ఉన్నట్లుండి మేళం వినిపించింది.



నారాయణమూర్తి ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూసేడు .... బంగళాముందు కార్లోంచి పెళ్ళికొడుకు దిగేడు మెరుస్తూన్న బట్టల్తో. పెళ్ళికొడుకుని సాదరంగా లోపలకి ఆహ్వానించేడు మామగారు. సందడి హెచ్చింది. పెళ్ళికొడుకుని మంటపంలో కూర్చోబెట్టేరు. పెళ్ళి సంరంభం మొదలైంది. పెళ్ళికొడుకు చుట్టాలూ, తల్లీ దండ్రీ మంటపం చుట్టూతా నిలిచేరు. పెళ్ళికూతురిని తెచ్చి పీటలమీద కూర్చోబెట్టేరు.

ఇదంతా నారాయణమూర్తి చూసేదన్న మాటేగాని అతని మనస్సిక్కడ నిలవలేదు. ఇందాకటిలా అతని మనస్సు డబ్బులో కలవక వెనక్కిమళ్ళి గేటుదాటి యింటివేపు వెళ్ళింది.

ఇంట్లో పరిస్థితులు గుర్తుకొచ్చేయి నారాయణమూర్తికి. వసారాలో కండలేక బొమికలాకారాల్తో ఆడుకొంటూన్న పిల్లలూ, ఇంట్లో నులకమంచంమీద జీవచ్ఛవంలా పడివున్న భార్య రవణమ్మా, వంటింట్లో కట్టెల్లేక పొగతో బాధపడుతూన్న చిన్నకూతురు జానకీ గుర్తుకొచ్చేరు. అప్రయత్నంగానే కళ్ళనీళ్ళు తుడిచే యాతని చేతివేళ్ళు. ఇంటి విషయాలు గుర్తుకు వచ్చినప్పుడల్లా కళ్ళనీళ్ళు తుడవడం ఆ చేతికి బాగా అలవాటయిపోయింది. బలవంతాన నారాయణమూర్తి తన మనస్సుని పెళ్ళిమీదకు లగ్నం చేసేడు.

పురోహితులు మంత్రాలు చదివేస్తున్నారు. పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ వాగ్దానాలు చేసుకోవటం విన్నాడు నారాయణమూర్తి. పిచ్చిగా ఓసారి నవ్వేడు. అతను నవ్వాలనే నవ్వేడు.

'ఎంతమంది ఈ వాగ్దానాలకీ, మాటలకీ నిలబడుతున్నారు?' అనే ప్రశ్న నారాయణమూర్తి ఎదర నించుంది.

తన పెద్ద కూతురు సీతని పెళ్ళాడుతూ. నలుగురు పెద్దలున్న పెళ్ళిమంటపంలో, బ్రాహ్మల సమక్షంలో— జీవితంలో ఏ సందర్భంలోనూ భార్యని దూరం చేసుకోననీ విడవననీ వాడూ వాగ్దానం చేసేడు. వాడంటే సీతకి మొగుడు వాడి పేరంటేనే నారాయణమూర్తికి పరమ అసహ్యం. సీతని పెళ్ళాడిన మరుక్షణం కట్నంకాకుండా కానుకలేవీ సంతృప్తికరంగా పెట్టలేదని వాడు సీతని అష్టకష్టాలూ పెట్టేడు. సరిగ్గా ఏలుకోలేదు. అందుకే అది' ఆ సీత తనకోసం తన తండ్రి బాధపడటం యిష్టపడక తను బాధపడింది. తన చావుతోనయినా తన భర్త మారుతాడనుకున్నది. కాని అది ఉత్తి అనుకోవడమే అయిపోయింది. అది చచ్చిపోయింది, వాడుమారలేదు. సీత చనిపోవడానిక్కారణం ఒక రకంగా ముఖ్యంగా డబ్బే అయ్యింది. అందుక్కోపం వచ్చిందప్పుడు నారాయణమూర్తికి. అప్పుడే అతనికి డబ్బుమీద విపరీతమయిన ఏహ్యత పుట్టింది. అంతకుపూర్వం కాస్తోకూస్తో డబ్బుకోసం కక్కుర్తి పడేవాడు. డబ్బులు పుచ్చుకుని మార్కులు వేయటం లాంటివి చేసేవాడు.

ఇప్పుడది మానేడు.

సీతంటే నారాయణమూర్తికీ, అతని

భార్యకీ చాలా ప్రేమ. సీత చచ్చిపోవడంతో రవణమ్మ మంచానికి దగ్గరయ్యింది అలా దగ్గరయి ఇంతవరకూ దూరమవలేదు.

నారాయణమూర్తికి మాధవరావు గారు తన కూతురుపెళ్ళికి పిలవడం గుర్తుకువచ్చింది. 'ఆయనకేం? దేవుడు తరగని ఆస్తి. దేశంలో గొప్పపేరు.'

'పిల్లవాడు ఏం చదివాడు బాబు!" మాధవరావుగారిని తనడిగేడు,

"డాక్టరీ చేస్తున్నాడు అమెరికాలో. బెజవాడ సమ్మంధం. ఉద్యోగం కూడా అమెరికాలోనే చేస్తాట." మీసాల్ని మెలిబెట్టి జవాబిచ్చేరు మాధవరావుగారు.

'ఇంతకీ పిల్ల అదృష్టవంతురాలు' అందామనుకుని ఆగిపోయేడు నారాయణమూర్తి. ఇందులో పిల్ల అదృష్టం ఏమీ కనిపించలేదతనికి.

పురోహితులు మంత్రాలు వల్లిస్తున్నారు. వచ్చిన జనం చేతుల్లో అక్షింతల్ని తడుముకుంటున్నారు. కొంతమంది కూల్‌డ్రింక్స్ సప్లయి చేస్తున్నారు. నారాయణమూర్తి ఒకటి అందుకున్నాడు. స్ట్రా నోట్లో పెట్టుకుని కళ్ళు తిప్పేడు. జనంవేపు తిరిగిన అతని కళ్ళు ఓ చోట నిలబడి పోయినయి. అందరివేపూ చూసి సంతృప్తి పడ్డాడు. అందరి చూపుల్నీ ఆకట్టుకున్న ఆవిడని చూస్తూ డ్రింకు పుచ్చుకోవటం మరిచిపోయేడు. చెవులకి రత్నాల దుద్దులూ, చేతికి రవ్వల గాజులూ, వేళ్ళకి ఉంగరాలూ, తలలో డిజైన్ చేసిన బిళ్ళా, మెళ్ళో రాళ్ళు పొదిగిన బంగారు నెక్లెసూ తళతళ మెరుస్తున్నాయి. మనిషి అంత అందగత్తె కాకపోయినా దేవకన్యలా మెరిసిపోతోంది—ఆ నగల్తో, దుస్తుల్తో. అందరితోనూ మాట్లాడుతోంది—చనువుగా. ఏ మాత్రం పరిచయం వున్నా వెళ్ళి విష్‌చేసి మాట్లాడుతున్నారు కొందరు. పెళ్ళికి వచ్చిన అందరి ఆడాళ్ళలోకీ ఆధునికంగా, బాగా డబ్బున్న దానిలా కనిపిస్తోంది.

'ఒట్టి ఆవిడమీదున్న నగలే ఓ లక్ష రూపాయలు విలువ చేస్తాయి' తెలిసిన వాడికిమల్లే వాటి విలువ చెప్పుకున్నాడు—నారాయణమూర్తి. అతని కళ్ళు మిరుమిట్లు గొలిపేయి. ఆవిడ మీదనుండి చూపులు తిప్పుకోలేక పోయేడు.

'ఇందుగల డందు లేడను సందేహము వలదు — అందరి హృదయాల్లోనూ ఆవిడ రూపమేనిలిచిపోయింది' అనుకున్నాడు నారాయణమూర్తి.

---

★ "ఇవాళ మా ఆయన కోటుమీద లిప్‌స్టిక్ మరకలు కనిపించగా ఎవరివని నిలదీసి అడిగాను. అవి లిప్‌స్టిక్ మరకలు కావనీ. టొమాటో జ్యూస్ మరకలనీ డబాయించారు....నీ వైతె ఏం చేస్తావు?"

"ఆ టొమాటో ఎవరో కనుక్కుంటాను." అన్నది ఆమె స్నేహితురాలు.

ఆమె మెడలోవున్న నెక్లెసుమీదే అతని చూపులు నిలిచేయి. ఎంత మరల్చు కుందామనుకున్నా ఓడిపోయాడు.

'ఆ ఒక్క నెక్లెసు తనకిస్తే? అబ్బ.... ఊహించుకో గూడదు గాని ఎంత మార్పువస్తుంది తనలో! — తన కుటుంబంలో!' అనుకున్నాడు.

ఆ మధ్య నారాయణమూర్తి కష్ట పడి సంపాదించి చిన్నపిల్ల ముచ్చట పడితే ఓ ముక్కు పుడక చేయించాడు. అదీ పదోక్లాసు కుర్రాడికి లెక్కల్లోకి నాలుగుమార్కులు తక్కువొస్తే పాస్ చేసి సంపాదించిన నలభయి రూపాయి లతో. దాన్జూసి అందరూ నకిలీ దన్నారే తప్ప ఒక్కరయినా 'ఓహో!' అని అనలేదు.

'అవును. ఎందుకంటారు?' లోలో పలే గొణుక్కున్నాడు నారాయణ మూర్తి.

పెళ్ళికొడుకు పుస్తె కట్టడం పూర్తి చేసేడు. అందరూ అక్షింతలు జల్లేరు. నారాయణమూర్తీ చేయెత్తేడు. తన చేతిలో డ్రింకు సీసానే కనిపించిం దతనికి. చిన్నగా లోలోపలే నవ్వు కున్నాడు. తన గళ్ళ చొక్కా సరి చేసుకున్నాడు మడతలు లేకుండా.

ఒకొక్కక్కళ్ళే వచ్చి మంటపంలో ఓ మూల కూర్చున్న పెద్దమనిషి దగ్గర కానుకలు చదివిస్తున్నారు. చదివిస్తున్న ప్రతివాడూ చిన్నదో, పెద్దదో ఒక కవ రందిస్తున్నాడు. అందులో పదులో, వందలో, వేలో వుండి వుంటాయి. వాటిలో ఎంతుందో ఒకడు తెరిచి లెఖ్ఖపెట్టి మరీ చెబు తున్నాడు. మరొకడు నోటు పుస్త కంలో రాసుకుంటున్నాడు.

'వాటిల్లో ఒక కవరు ఇలా ఇస్తే...' అనుకున్నాడు. నారాయణమూర్తి. అను కోంగానే అతనికి యిందాకటి ఆమె గుర్తుకి వచ్చింది. తలతిప్పి ఆ వేయి మందిలోనూ వెదికేడు. ఆవిడకనిపించ లేదు. నారాయణమూర్తికి మనసు నిల కడగా లేదు. మళ్ళీపెళ్ళి మంటపంలోకి చూసేడు. చటుక్కున గుర్తుకువచ్చింది. 'అసలు తనింతవరకు పెళ్ళి కొడుకుని సరిగ్గా చూడలేదని.

సోఫాలోంచి లేచేడు. డ్రింకు పూర్తిగా తాగేసి, మంటపం దగ్గరగా వెళ్ళి నుంచున్నాడు.

'ఫరవాలేదు బాగానే వున్నాడు. కాకపోతే కాస్తంత నలుపు. ఈయనకి అందంకన్నా డబ్బుబాగా వుండి వుంటుంది' అనుకున్నాడు నారాయణ మూర్తి. ఆలోచిస్తూ కదలబోయే డక్కడ్నుంచి. ఆయన చూపు అతని ఆలోచనలకీ, కదలికకీ బ్రేకు వేసింది.

ఆమె....! ఆమె...పెళ్ళి కొడుకుతో ఏదో మాట్లాడుతోంది "ఆవిడ పెళ్ళి కొడుకు చెల్లెలు" వెనుకనుంచి నారా యణమూర్తి అడిగినట్టుగానే జవా బిచ్చేడు ఒకాయన.

"థాంక్స్!" అన్నాడు నారాయణ మూర్తి. అలా ఎందుకన్నాడో తెలిలే దతనికి.

ఇందాకటి తన ఆలోచనలని మళ్ళీ గుర్తులోకి తెచ్చుకున్నాడు. ఆలోచనల

అందాన్ని ఇంతమందిలో కూర్చుని అనుభవించటం కంటే ఏ మూరుమూలో ప్రశాంతంగా వుండే చోటున కూర్చుంటే బాగుంటుం దనుకుని, ఆ కొబ్బరి తోటలో చివరికంటా పోయి కోనేరుగట్టు ప్రక్కన సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు — సందడికీ, బాధకీ దూరంగా, ఆనందానికి దగ్గరగా. నారాయణమూర్తికి అతని ఆలోచనలు అమరలోకాన్ని చూపించేయి. పదిహేను నిమిషాల వాస్తవిక కాలంలో పదిహేను జన్మలకయినా మరవలేని ఊహా ప్రపంచాన్ని చూసేడు. అందుకే నారాయణమూర్తికి ఆలోచనల్లో జీవించడం యిష్టం.

అతని తల్లి తన చివరి రోజుల్లో నారాయణమూర్తిని కూర్చోబెట్టుకుని, "నారీ! మన వంశం బీదరికానికి పెట్టింది పేరు. ఈ విషయం నీ కెందుకు చెబుతున్నానూ అంటే— చిన్నప్పట్నుంచీ చూస్తున్నా. నీకీ బీదరికంమీద సదభిప్రాయం లేదు. అప్పుడప్పుడూ ఈ దుస్థితికి దూరంగా పారిపోతున్నావు కూడా! ఇంకో మాట. నువ్వు అలా ప్రయత్నించినా ఎప్పుడూ ఓడిపోతావు జాగ్రత్త! అందుకే నీకు ఈ చెప్పడం. సుఖపడేందుకు ఎప్పుడూ ప్రయత్నించకు! జీవించడానికే ప్రయత్నిస్తావు కదూ?!...."

క్షణం ఆగి కాస్సేపు తీరుబడిగా దగ్గి అంది—

"ఇంక నీకేం చెప్పను?" అని.

అంతే, ఆ తరువాత ఆవిడ చచ్చిపోయింది.

ఆవిడ చెప్పింది నిజం అని ఒప్పుకున్నప్పటికీ, అల్లాంటి ప్రయత్నాలు చేయటం కూడా తప్పుకాదనిపించింది నారాయణమూర్తికి.

వాస్తవంగా అనుభవించలేకపోయినా నారాయణమూర్తి ఆలోచనల్లో సుఖాన్ని అనుభవించగలడు. తనలో ఆశక్తి ఉన్నందుకే ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటాడతను.

నారాయణమూర్తి తన ఆలోచనల నాపుజేసి మంటపం వేపు కదిలేడు. ఆసరికి పెళ్ళి పూర్తయిపోయింది. వచ్చిన జనం పార్టీ ఏర్పాటుచేసిన షామియానాల్లోకి వెళ్ళుతున్నారు.

నారాయణమూర్తికి అప్పుడే వెళ్ళాలనిపించలేదు. కొంతమంది తోటలో

---

★ తల్లి పులి చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటోంది. పిల్ల పులి వేటగాణ్ని తరుముతోంది. వేటగాడు పిల్లపులికి అందకుండా చెట్టు చుట్టూ తిరుగుతున్నాడు.

తల్లి పులి: తినే తిండితో ఆట లాడరాదని నీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదేం?

అక్కడక్కడా ఇంకా కూర్చునున్నారు. నారాయణమూర్తి సోఫాలవేపు కదల బోయి చటుక్కున ఆగిపోయాడు. కళ్ళు టపటప లాడించేడు. అంత చల్లగాలిలోనూ చెమటపట్టింది. మెరుస్తున్న వస్తువును చటుక్కున వంగి తీసుకున్నాడు. ఓసారి భయంగా చుట్టూ చూసేడు.

బోసిమెడతో మంటపం ప్రక్కనుంచి పెళ్ళికొడుకు చెల్లెలు తనవేపు వస్తున్నట్లు అనిపించింది. ఓసారి ఒళ్ళు తడుముకుని గబగబా గేటువేపు వెళ్ళిపోయేడు నారాయణమూర్తి.

★ ★ ★

నారాయణమూర్తి ఓపిగ్గా పది రోజులు గడిపేడు—గుండె చిక్కబట్టుకొని. ఈ రోజులన్నీ ఎదురు చూసేడు — మాధవరావుగారింట్లో పెళ్ళికొడుకు చెల్లెలు నగపోయిందనే వార్త ఎవరయినా చెబుతారేమోనని. కాని అట్లాంటిదేమీ జరగలేదు.

ఈ పదిరోజుల్లోనూ నారాయణమూర్తికి గుండెధైర్యం బోలెడంత చేకూరింది. అందుకే మర్నాడు ఆ నెక్లెసు తీసుకుని ఓ షాపుకెళ్ళాడు.

"అమ్మడానికీ, కుదవ బెట్టడానికీ కాదు గానిధరచెప్పాలి!" అన్నాడు దాన్ని షాపువాడి చేతిలోపెట్టి.

దాన్నిచూసి వాడికళ్ళు యింతింతై అంతయిపోయినాయ్. వాడుఆశ్చర్యంగా నారాయణమూర్తికేసి చూసేడు.

"మీదే అయివుంటుంది" అన్నాడు వాడు చిన్నగానవ్వి. నారాయణమూర్తికి వాడి మాటలు అర్థంకాలేదు. ముఖం చిట్లించేడు.

"మంచిడిజైను. ఏకంపెనీది?" మళ్ళీ అడిగేడు షాపువాడు.

"కంపెనీది కాదు. చేయించింది. మా బంధువులది" "సార్! ఇంకెవ్వళ్ళ కయినా చూపించుకోండి. గిల్టుదానికి బంగారం ధర చెప్పేవాళ్ళు ఎవళ్ళయినా దొరుకుతారేమో కనుక్కోండి."

ఆ తరువాత మాటలు నారాయణమూర్తి వినిపించుకోలేదు. రోడ్డుమీద కొచ్చేడు. తన చేతిలో షాపువాడు పెట్టిన నెక్లెసు నిగనిగలాడుతోంది. అది తాచుపాములా కనిపించింది. ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్లయింది — నారాయణమూర్తికి. దాన్ని చూసి చూసి దూరంగా చీకట్లోకి గిరవాటేసేడు.

అతని కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినయ్.

తన కూతురుకు చేయించిన బంగారు ముక్కుపుడక గిల్టుగా, నకిలీ నెక్లెసు పెళ్ళికొడుకు చెల్లెలు మెడలోకి బంగారు నగగా ఎందుకు మారుతుందో ఊహల్లో జీవించే నారాయణమూర్తికి ఏం తెలుసు?

★★★